సామాజిక సేవలో శివలాల్ యాదవ్ ఛారిటబుల్ ట్రస్టు

పేదలకు బాసట.. ఎంతోమందికి ఆదర్శం



ప్రభుత్వ పాఠశాలకు సామగ్రి అందజేస్తున్న మహేష్ యాదవ్(ఫైల్)



పేదలకు బ్లాంకెట్ల పంపిణీ(ఫైల్)

ఖైరతాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వచ్చేవి, పోయేవి మూడు: పేదరికం, వ్యాధి, డబ్బు. పోతే రానివి మూడు: కాలం, యవ్వనం, పరువు. వచ్చినా వదిలిపోనివి మూడు: కీర్తి, జ్ఞానం, విద్య. వెంట వచ్చేవి మూడు: పాపం, పుణ్యం, నీడ. వీటిని నమ్ముకుంటూ ఏర్పాటైన శివలాల్ యాదవ్ ఛారిటబుల్ ట్రస్టు 15 సంవత్సరాలుగా పేదలకు సేవలందిస్తూ నగరంలో మంచి గుర్తింపు పొందింది.

ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి యేటా వేసవికాలంలో చలివేంద్రం, పాఠశాలలు ప్రారంభం కాగానే విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, స్టేషనరీ, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. చలికాలంలో పేదలకు, ఫుట్‌పాత్‌లపై నిద్రించే వారికి బ్యాంకెట్లు పంపిణీ చేస్తున్నారు. పేదల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం, అంత్యక్రియలకు సహకారం, రంజాన్ మాసంలో పేద ముస్లింలకు నిత్యావసరాలను పంపిణీ చేస్తున్నారు. కరోనా కాలంలో ట్రస్టు చేసిన సేవలకు పలు అవార్డులు దక్కాయి.

రెండు నెలల ఆదాయం సేవలకు..



సంవత్సరంలో రెండు నెలల ఆదాయం పేదల కోసం ఖర్చు చేస్తాం. మా నాన్న పేరిట ఏర్పాటైన శివలాల్ యాదవ్ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా సంవత్సరం పొడవునా సేవా కార్యక్రమాలు చేస్తూనే ఉంటాం. నేను బతికి ఉన్నంత వరకు సేవలు కొనసాగిస్తూనే ఉంటా. డబ్బు లేని కారణంగా ఎవరూ చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో విద్యార్థులకు, ప్రభుత్వ విద్యాసంస్థలకు సహకారం అందిస్తుంటాం.

- ఎం.మహేష్‌యాదవ్, ట్రస్టు చైర్మన్



బాపునగర్‌లోని వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి తదితరులు



హేమావతినగర్‌లోని సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఆలయ ఫౌండర్ చైర్మన్ మాణిక్‌రెడ్డి, బస్తీ అధ్యక్షుడు బాలు తదితరులు



శాస్త్రీనగర్‌లోని సాయిబాబా ఆలయంలో పూజలు చేసిన మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దూడల రవిగౌడ్, రమేష్ నాయక్, బాల్‌రాజ్

ఘనంగా గురుపూర్ణిమ వేడుకలు



ప్రేమ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



జీటీఎస్ కాలనీలోని సాయిబాబా ఆలయంలో జరిగిన పూజలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి.నవీన్ యాదవ్ దంపతులు, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, తదితరులు



బోరబండలో నిర్వహించిన గురుపౌర్ణమి వేడుకల్లో కార్పొరేటర్ బాబాఫసియుద్దీన్ తదితరులు

బంజారాహిల్స్/వెంగళరావునగర్/బోరబండ/బేగంపేట/ఎర్రగడ్డ/అమీర్‌పేట/ఖైరతాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గురుపూర్ణిమ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది పూజాదికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సత్కరించారు. ప్రేమ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గౌతమ్‌రావు, రాఘవరెడ్డి పాల్గొన్నారు. వెంగళరావునగర్ డివిజన్‌లోని శ్రీ షిర్డీ సాయిరాం సంస్థానం, జవహర్‌నగర్, జీటీఎస్ కాలనీలోని సాయిబాబా ఆలయాల్లో కార్పొరేటర్ దేదీప్య విజయ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, హైమావతి సూర్యప్రకాష్‌రావు, రఘురాములు, కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎన్. అర్జున్, హనుమంతరావు యాదవ్, అర్చకులు సంతోష్, శేఖర్, మల్లికార్జున్ పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.



బాలయ్యనగర్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన అన్నదానం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, నాయకుడు నరేందర్ తదితరులు

యోగా గురువులకు సన్మానం

బంజారాహిల్స్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆది గురువులు చూపిన సనాతన ధర్మమే మానవాళిని నడిపిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. గురుపూర్ణిమను పురస్కరించుకొని శ్రీనగర్‌కాలనీ శాలివాహననగర్ కమ్యూనిటీ హాల్లో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం యోగా గురువులకు సన్మానం చేశారు. రామచందర్‌రావు మాట్లాడుతూ రంగం ఏదైనా గురువు ఆధ్వర్యంలోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రశేఖర్ తివారి, బీజేపీ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు గౌతమ్‌రావు, నియోజకవర్గ నాయకులు కుంబాల గంగరాజు, ప్రేమ్‌కుమార్, అంతారం శాంతికుమార్ పాల్గొన్నారు.



యోగా గురువు సి.వి.రావును సన్మానిస్తున్న రామచందర్‌రావు, దీపక్‌రెడ్డి

ఈఎస్ఐసీలో సర్వర్ డౌన్

- ఇబ్బంది పడ్డ ఔట్‌పేషంట్లు

బేగంపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ ఆస్పత్రి ఆన్‌లైన్ సేవల్లో అంతరాయం ఏర్పడడంతో గురువారం ఓపీ కోసం వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈఎస్ఐసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, మెడికల్ కళాశాలకు చెందిన బోధన ఆస్పత్రుల్లోని ఓపీ రిజిస్ట్రేషన్ విభాగాల్లో రోగులు ఉదయం 5 గంటల నుంచే బారులు తీరారు. సర్వర్ పని చేయక పోవడంతో మధ్యాహ్నం వరకు రోగులు, వారి సహాయకులతో ఓపీ బ్లాక్‌లు కిక్కిరిసిపోయాయి. గురువారం న్యూరాలజీ విభాగం ఓపీ ఉండడంతో సూపర్ స్పెషాల్టీ విభాగంలో ఓపీ రోగుల సంఖ్య అధికంగా ఉంది. న్యూరాలజీ ఓపీకి ఒకే రోజు 300 మంది రోగులు వస్తుంటారు. ఆన్‌లైన్ సేవల్లో అంతరాయం కారణంగా వీరు తీవ్ర అవస్థలు పడ్డారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సర్వర్ డౌన్ వల్ల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పని చేయకపోవడంతో చివరకు ఆస్పత్రి ఉన్నతాధికారుల చొరవ మేరకు మాన్యువల్ పద్ధతిలో రోగులకు చీటీలు రాసిచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు సర్వర్ సమస్య పరిష్కారం కావడంతో చీటీల ద్వారా నమోదు చేసుకున్న పేర్లను కంప్యూటర్‌లో నమోదు చేశామని ఆస్పత్రి వర్గాలు తెలిపారు.



ఈఎస్ఐసీలో ఓపీ కౌంటర్ వద్ద వేచి ఉన్న ప్రజలు

మహిళ మెడలో గొలుసు చోరీ

- ఇద్దరు నిందితుల అరెస్ట్
- బంగారు గొలుసు, బైక్ స్వాధీనం

అమీర్‌పేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ మెడలో గొలుసు చోరీ అయింది. ఇద్దరు నిందితుల నుంచి నాలుగున్నర తులాల బంగారు గొలుసు, ఓ బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, ఏసీపీ రాఘవేంద్రరావుతో కలిసి పశ్చిమ మండల అదనపు డీసీపీ గోవర్ధన్ వివరాలను వెల్లడించారు. బీకేగూడలోని దాసారం బస్తీకి చెందిన సుజాత నడుచుకుంటూ వెళ్తుండగా బైక్ పై వచ్చిన ఆగంతకులు ఆమె మెడలోని బంగారు గొలుసు తెంచుకుపోయిన విషయం తెలిసిందే. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకోవడం కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో అమీర్‌పేటలోని గురుద్వారా ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించిన నిందితులను అరెస్ట్ చేశారు. గుంటూరు జిల్లా కొల్లిపొర ప్రాంతంలోని జగనన్న కాలనీకి చెందిన పెద్దమల్ల లీలాకృష్ణప్రసాద్(24) అమీర్‌పేటలో సేల్స్ ఫోర్స్ కోర్సులో శిక్షణ పొందుతుండగా, గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడికి చెందిన కోట దినేష్ (24) నరేష్ ఐటీలో శిక్షణ పొందుతున్నాడు. వీరిద్దరూ అమీర్‌పేటలోని గ్రాండ్స్ బాయ్స్ హాస్టల్లో కలిసి ఉంటున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనాలకు అలవాటు పడి డబ్బు కోసం చోరీలు మొదలు పెట్టారు. బుధవారం నిందితులిద్దరూ పల్సర్ బైక్ పై బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతంలో గొలుసు దొంగతనానికి పాల్పడడం కోసం తిరిగారు. వీలుకాకపోవడంతో ఎస్ఆర్‌నగర్‌కు వచ్చి బల్కంపేట దాసారం బస్తీలో మహిళ మెడ నుంచి గొలుసును తెంచుకుపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా నిందితులను పట్టుకుని వారి నుంచి బంగారు గొలుసు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో పెద్దమల్ల లీలాకృష్ణ ప్రసాద్ 2021 గుంటూరు జిల్లాలోని పట్టాభీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గొలుసు చోరీకి పాల్పడినట్లు వెల్లడైంది. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



బస్తీవాసులకు మందులను అందజేస్తున్న మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రజలకు సూచించారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 బస్తీ దవాఖానాలో మెగా ఆరోగ్య శిబిరాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బస్తీవాసులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణంలో మార్పు వల్ల అనారోగ్యం బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుందని, వారిపై ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని తెలిపారు. అలాగే, శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేనేత వస్త్రప్రదర్శనలోని చేనేత కళాకారులకు జయంతి ఆస్పత్రి సిబ్బంది ఉచిత వైద్య పరీక్షలు చేశారు. చేనేత కళాకారుల ఆరోగ్యం పట్ల ఇండియన్ సిల్క్ గ్యాలరీ నిర్వాహకులు శ్రద్ధ తీసుకోవడం మంచి పరిణామమని కార్డియాలజిస్ట్ డాక్టర్ టిప్పు సుల్తాన్ అన్నారు. చేనేతకారులు ఆరోగ్యం పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్య శిబిరం నిర్వాహకులు వినయ్ కుమార్, శ్రీనివాసరావు తెలిపారు.



చేనేత కార్మికులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వెంగళరావునగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ్‌నగర్ యూపీహెచ్‌సీ సహకారంతో మధురానగర్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో గురువారం శ్రీ సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. వైద్య సిబ్బంది అన్నిరకాల పరీక్షలు చేశారు. వివిధ విభాగాల వైద్యులు అజయ్ కుమార్, దీప్తి, కృష్ణకుమార్, ప్రేమ్, ఆశ్రిత, రోహన్‌సింగ్, తదితరులు అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, కోశాధికారి సుగుణ, హనుమంతరావు యాదవ్, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

సచివాలయ ముట్టడికి యత్నించిన ఆప్

- అరెస్టు చేసిన పోలీసులు

ఖైరతాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు విమర్శించారు. పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు గురువారం సచివాలయ ముట్టడికి యత్నించారు. పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ విద్యా కమిషన్ సిఫార్సులను ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేదలకు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను పట్టించుకోకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు బుద్ర రాముగౌడ్, ఎండీ మాజీద్, డాక్టర్ అన్సారి, విజయ్ ముల్లంగి, దర్శనం రమేష్, మహ్మద్ సోహైల్, లక్ష్మయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశమైన మాగంటి సునీత

మాగంటి ఆశయాలను సాధిస్తా : సునీత

బంజారాహిల్స్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసమే చివరి శ్వాస వరకు పోరాటం చేసిన దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆశయాలను సాధిస్తానని ఆయన సతీమణి మాగంటి సునీత అన్నారు. గోపీనాథ్ మరణానంతరం తొలిసారిగా ఆమె నవోదయకాలనీలోని క్యాంపు కార్యాలయానికి గురువారం వచ్చారు. ఎర్రగడ్డ, బోరబండ డివిజన్‌లకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ఆరోగ్యం బాలేక పోయినా, వైద్యులు వారిస్తున్నప్పటికీ మాగంటి ప్రజల కోసం పనిచేయాలని తప్పించి పోయేవారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజల సమస్యలపై తన వంతు పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. కార్యకర్తలకు భరోసా ఇచ్చేందుకు ఇక నుంచి ప్రతీ రోజు అందుబాటులో ఉంటానన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



పాటిగడ్డలో మొక్క నాటుతున్న కోట నీలిమ, విశాల్ సుధాం

విరివిగా చెట్లు పెంచాలి

బేగంపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం విరివిగా చెట్లు పెంచాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు డా.కోట నీలిమ అన్నారు. బేగంపేటలోని పాటిగడ్డ మోడల్ మార్కెట్లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు విశాల్ సుధాం ఆధ్వర్యంలో గురువారం జరిగిన వనమహోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మోడల్ మార్కెట్ ప్రాంగణంలో పలు మొక్కలను నాటారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులతో పాటు బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, నాయకులు హనిఫ్‌ఖాన్, మునీర్‌ఖాన్, బబ్లూ, జగదీష్, మాధవి, లలిత, జులేఖ, తస్లీమ్ తదితరులు పాల్గొన్నారు.



బోనాల సందర్భంగా ఆలయాల కమిటీల ప్రతినిధులకు ప్రభుత్వం తరపున చెక్కులను పంపిణీ చేస్తున్న షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, కార్పొరేటర్ మహాలక్ష్మి, కాంగ్రెస్ నేత మహేందర్‌బాబు తదితరులు

● ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.20, 86 ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్, భారతీయ విద్యాభవన్ స్కూల్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లోనూ, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 11కేవీ జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.24 ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాగేనేని సరిత



చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీపీసీసీ రాష్ట్ర సెక్రటరీ నరసింహన్

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

తిరుమలగిరి జూలై 10 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం తీసుకున్న భూములకు కేంద్రం చెల్లించాల్సిన రూ.303 కోట్లను కంటోన్మెంట్ బోర్డుకు వచ్చేలా చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం లాల్‌బజార్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు నాగనేని సరిత, బొల్లారం సాదన మందిర్ వద్ద కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాష్, బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో సీఎం, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే శ్రీగణేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్ కూడా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. జీవి బాల్‌రాజ్, నాగేందర్, సతీష్ తదితరులు ఉన్నారు.



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసిన ఆనంద్‌బాబు తదితరులు

సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి

సికింద్రాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి వ్యవసాయ మార్కెట్‌లోని సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు మార్కెట్ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మార్కెట్ చైర్మన్ రాగీరు ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్, సభ్యులు గురువారం మంత్రిని కలిశారు. మార్కెట్‌లోని సమస్యలను ఆయనకు వివరించి, శీఘ్రగతిన పరిష్కరించాలని కోరారు. గతంలో మాదిరిగా మార్కెట్ కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని వారు మంత్రిని కోరారు. అలాగే వైస్ చైర్మన్, సభ్యులకు కూడా గౌరవ వేతనం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కంటోన్మెంట్‌లో రోడ్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

మల్కాజిగిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ఏఓసీ పరిధిలో రోడ్ల ఏర్పాటుకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి చేసిన కృషి ఫలించింది. ఏఓసీలో అదనపు రోడ్ల ఏర్పాటుకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఈ మేరకు బల్దియా కమిషనర్ కర్ణన్ అధ్యక్షతన రక్షణశాఖ రెవెన్యూ అధికారులు చర్చలు జరిపి ఎట్టకేలకు ఏఓసీలో అదనపు రోడ్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఏళ్లకాలం నాటి సమస్య పరిష్కారం కానుంది. ఏఓసీలో రోడ్ల ఏర్పాటు కానుండటంతో సఫిల్‌గూడ, మల్కాజిగిరి, ఆర్కేపురం, సైనిక్‌పురి, ఈసీఐఎల్ ప్రాంతాల నుంచి రాకపోకలకు మార్గం సుగమమైంది. దీంతో ఏఓసీ రోడ్ల ద్వారా ప్రయాణించే ప్రయాణికులతో పాటు నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే మర్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

మల్కాజిగిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పాత మల్కాజిగిరిలోని భక్తాంజనేయ స్వామివారి ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. గురువారం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో ఈఓ వెంకన్నతో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు చింతల మల్లేష్‌గౌడ్, మండల రాధకృష్ణయాదవ్, నుచ్చు వీరేశం యాదవ్, రంగా విజయ్‌కుమార్ పలువురు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

భవనంపై నుంచి కిందపడి వ్యక్తి మృతి

పీర్జాదిగూడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన దయానంద్(32), బ్రహ్మం స్నేహితులు. వీరిద్దరూ కలిసి ఐదు రోజుల నుంచి బోడుప్పల్ వీరారెడ్డి నగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనంలో కార్పెంటర్ పనిచేస్తూ అదే భవనంలో ఉంటున్నారు. బుధవారం రాత్రి బ్రహ్మం కింద నిద్రపోతుండగా బిల్డింగ్ పైన దయానంద్ తన కుటుంబ సభ్యులతో ఫోన్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. గురువారం ఉదయం బ్రహ్మం దయానంద్ కోసం వెతుకుతుండగా బిల్డింగ్ వెనుక కింద పడి మృతిచెంది ఉండటాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.



పద్మారావునగర్‌లో గురుపౌర్ణమి వేడుకలకు హాజరైన బీజేపీ నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి



సాయిబాబాకు అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



భూలక్ష్మమ్మ దేవాలయంలో ప్రసాదాలు పంపిణీ చేస్తున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్



సీతాఫల్‌మండి దత్తాత్రేయ ఆలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ సామల హేమ తదితరులు

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

బౌద్ధనగర్, రెజిమెంటల్‌బజార్, పద్మారావునగర్, తిరుమలగిరి, మారేడుపల్లిలో జూలై 10 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలో గురువారం పలు ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. సీతాఫల్‌మండి దత్తాత్రేయ ఆలయంలో స్థానిక కార్పొరేటర్ సామల హేమ, నాయకులు కరాటే రాజు, అలాగే చిలకలగూడ బాలాంజనేయస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ నాగులూరి సాయిబాబా పూజలు చేశారు. సతీష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. మైలార్‌గడ్డ సాయిబాబా ఆలయంలో ఆలయ చైర్మన్ మింగు వెంకట సాయికుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు చేశారు.

పద్మారావునగర్‌లో

గురుపౌర్ణమి సందర్భంగా సెవెన్ హిల్స్ కన్వెన్షన్‌లో హాలులో బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు గుండగోని భరత్‌గౌడ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్‌రావు హాజరై ఉస్మానియా వర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ తిరుపతి రావు, భరత్‌భూషణ్, శంకరయ్య, డాక్టర్.సౌమ్య, వీరబాబు, వివిధ వర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు, ప్రిన్సిపాల్స్, టీచర్లను ఘనంగా సత్కరించారు. మాజీ జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదరి మేకల సారంగపాణి, పార్లమెంటు కన్వీనర్ రాజశేఖర రెడ్డి, కార్పొరేటర్లు సరళ, కొంతం దీపిక, చీర సుచిత్ర, సుప్రియ నవీన్‌గౌడ్, గురుపౌర్ణమి అభియాన్ కన్వీనర్ క్రాంతికుమార్, నాగేశ్వరరెడ్డి, ఎస్.రాజు, వై.సురేష్, రామంచ మహేష్‌లు పాల్గొన్నారు.

● పద్మారావునగర్‌లోని సాయిబాబా ఆలయంలో సాయి సప్తాహ వేడుకల్లో భాగంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు సనత్‌నగర్ శాసన సభ్యులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి హాజరై పూజల్లో పాల్గొన్నారు. అనంతరం డా.సాయికుమార్‌బాబా వారిని సత్కరించారు. సాయంత్రం డా.సాయికుమార్‌బాబా ఆలయ ప్రాంగణంలో హాజరైన అశేష భక్తజనాలకు తన దివ్య సందేశాన్ని అందించారు. బోయగూడ సాయి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఘనంగా సత్కరించారు.



జ్యోతి వెలిగిస్తున్న రాంచందర్‌రావు, పిఎల్ శ్రీనివాస్

తిరుమలగిరిలో

బొల్లారంలోని వివిధ ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు గురువారం జరిగాయి. బొల్లారం డౌటన్ బజార్‌లోని భూలక్ష్మమ్మ దేవాలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, కుంకుమార్చన లాంటి పూజలు నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్ పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జీవి బాల్‌రాజ్, నాగేందర్, సతీష్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా డౌటన్ బజార్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఉన్న సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఈఓ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కన్నుల పండువగా జరిగాయి. సాయిబాబాకు అభిషేకం, అర్చన నిర్వహించారు. భక్తులందరికీ ఈఓ మహేందర్ రెడ్డి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.



సాయిబాబా వ్రతంలో పాల్గొన్న కొత్త సంజీవరెడ్డి దంపతులు

రెజిమెంటల్‌బజార్‌లో

గురువులు చూపిన మార్గంలో నడవాలని గురుపౌర్ణమి వేడుకలు జరుపుకుంటున్నామని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. గురువారం సికింద్రాబాద్ ఎస్‌వీఐటీ ఆడిటోరియంలో మహబూబ్ కాలేజ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పిఎల్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ నరేష్‌యాదవ్, సెక్రటరీ అనిల్ కుమార్, జాయింట్ సెక్రటరీ సిఎస్ నర్సింహారావు, ట్రెజరర్ భగవత్ వారణాసి, మెంబర్స్ డాక్టర్ ప్రేమ్‌నారాయణ్, నామ్‌దేవ్, పద్మారావు, నయూమోద్దిన్ పాల్గొన్నారు.

మారేడుపల్లిలో

గురు పౌర్ణమి సందర్భంగా ప్రముఖులు, భక్తులు గురువారం వివిధ ఆలయాలను దర్శించి పూజలు నిర్వహించారు. వెస్ట్ మారేడుపల్లిలోని సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలోని షిర్డి సాయిబాబాను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొంతం దీపిక, లింగాని ప్రసన్న లక్ష్మీ, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, ఆలయ చైర్మన్ రేపాల వెంకటేశ్వర్లు, ఈఓ అరుణ కుమారి, కమిటీ సభ్యులుపాల్గొన్నారు.

● మహేంద్రహిల్స్‌లోని రవికాలనీలోని షిరిడీ సాయిబాబా సంస్థాన్‌లో గురువారం గురు పౌర్ణమి సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు ఆర్టీసీ మాజీ చైర్మన్ కొత్త సంజీవరెడ్డి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.



మోండా డివిజన్ పాలికాబజార్‌లోని సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి సందర్భంగా సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు వెంకట్రావ్, శంకర్‌రావు, రాజేష్, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, బీఆర్ఎస్ నాయకులు తలసాని సైలాబ్ యాదవ్, నాగులు, ఆకుల హరికృష్ణ, రాములు, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- రెజిమెంటల్‌బజార్, ఆంధ్రజ్యోతి

నేడు దక్షిణ్ సంవాద్ స్వర్ణోత్సవాలు

పద్మారావునగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అధికారిక భాషా విభాగం ఆధ్వర్యంలో దక్షిణ్ సంవాద్ పేరుతో శుక్రవారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో అధికార భాషా విభాగం స్వర్ణ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారని అధికారిక భాషా విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్.మీనాక్షి జాలి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కవాడిగూడలోని పత్రికా సమాచార కార్యాలయ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మీనాక్షి జాలి మాట్లాడుతూ స్వర్ణోత్సవ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జూన్ 26న న్యూఢిల్లీలో నిర్వహించారని, దీనికి తరువాయి వేడుకల్లో భాగంగా ప్రధాన వేడుక 11 శుక్రవారం గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియం వేదిక కానుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. విశిష్ట అతిథులుగా రాజ్యసభ డిప్యూటీ చైర్మన్.హరివంశ్, కేంద్ర హోంమంత్రిత్వశాఖ సహాయమంత్రి నిత్యానంద్ రాయ్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు హాజరవుతున్నారని తెలిపారు. దక్షిణ భారతదేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఉన్నతాధికారులు, మేధావులు, తరలి వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమ సమన్వయకర్తగా పీఐబీ కార్యాలయ అడిషనల్ డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ వ్యవహరించారు.

ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలి

నల్లకుంట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ నియంత్రణకు చట్టం చేయాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) కన్వీనర్ ఎ.విజయ్‌కుమార్, భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, అధ్యక్షుడు కోట రమేష్ డిమాండ్ చేశారు. గురువారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఇ.నవీన్ నికోలస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ స్కూల్స్‌కు రెండో శనివారం సెలవు ఇవ్వాలని, ప్రైవేట్ స్కూల్స్‌లో పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేశారు.

విరివిగా చెట్లు పెంచాలి

బేగంపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం విరివిగా చెట్లు పెంచాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు డా.కోట నీలిమ అన్నారు. బేగంపేటలోని పాటిగడ్డ మోడల్ మార్కెట్లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు విశాల్ సుధాం ఆధ్వర్యంలో గురువారం జరిగిన వనమహోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మోడల్ మార్కెట్ ప్రాంగణంలో పలు మొక్కలను నాటారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులతో పాటు బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, నాయకులు హనిఫ్‌ఖాన్, మునీర్‌ఖాన్, బబ్లూ, జగదీష్, మాధవి, లలిత, జులేఖ, తస్లీమ్ తదితరులు పాల్గొన్నారు.



పాటిగడ్డలో మొక్క నాటుతున్న కోట నీలిమ, విశాల్ సుధాం

అభివృద్ధి పనులకు మోక్షం : ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడుపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : బస్తీలు, కాలనీల్లో వర్షపునీరు నిలవకుండా చర్యలు చేపట్టినట్లు కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మోండా డివిజన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్, శివాజీనగర్‌లలో రూ.64 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (స్టామ్ రేయిన్ వాటర్) పనులను ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డ్రైన్ వాటర్ వ్యవస్థ సరిగా లేక అంబేద్కర్ నగర్ శివాజీ నగర్ బస్తీల వాసులు ఎన్నో ఇబ్బందులకు గురవుతుండడంతో ప్రభుత్వం నుంచి స్పెషల్ డెవలప్‌మెంట్ ద్వారా నిధులను విడుదల చేయించి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, సీనియర్ నాయకులు సంతోష్ యాదవ్, బద్రీ యాదవ్, వైష్ణవి యాదవ్, నాగేష్ యాదవ్, వెంకట్‌రాజు, శేఖర్, పిట్ల నాగేష్, దేవేందర్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ గేటు నిర్మాణ పనులకు శంకుస్థాపన

అడ్డగుట్ట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్ట డివిజన్ ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్ బస్తీలో ఉన్న మహంకాళి అమ్మవారి ఆలయానికి గేటుతో పాటు ప్రహరీ నిర్మాణ పనులకు అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇరవై ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఆలయ సమస్యను సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు చొరవతో పరిష్కరించడం జరిగిందని, ఆలయాల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నక్కా మధు, పెండెం మనోహర్, రాజు, దశరథ్, వెంకట్, హరి, మురళీ, కొండయ్య, రమేష్, కోటేశ్వర్‌రావు, వేణుగోపాల్, కొమురయ్య జైకుమార్, వెంకటేష్‌లతో పాటు బస్తీ పెద్దలు పాల్గొన్నారు.



పద్మారావునగర్‌లో జరిగే దివ్యాంగుల విస్తృతస్థాయి సమావేశానికి వెళుతున్న దివ్యాంగులు

దివ్యాంగుల డిమాండ్లను పరిష్కరించాలి

అడ్డగుట్ట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం ప్రతినిధి దయామని ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సికింద్రాబాద్ పద్మారావునగర్‌లో వికలాంగుల సంఘాల విస్తృతస్థాయి సమావేశానికి అడ్డగుట్ట నుంచి దివ్యాంగులు వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు దివ్యాంగులకు పెన్షన్, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెప్పిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ నెల 13న చలో హైదరాబాద్ వికలాంగుల మహాగర్జనకు దివ్యాంగులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం ప్రతినిధులు సరిత, కొమురయ్య సుమలత, నవనీత, శైలజ, సుగుణ కుమారి, ప్రవీణ్ , భరత్, శివకుమార్, భాస్కర్‌లు పాల్గొన్నారు.



మల్లారి అనిల్‌కుమార్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు చికోటి శ్రీనివాస్ తదితరులు

ఎన్‌హెచ్‌ఆర్‌సీ వైస్ ప్రెసిడెంట్ నియామకం

బౌద్ధనగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్‌గా చిలకలగూడకు చెందిన మల్లారి అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు చికోటి శ్రీనివాస్, కటకం శ్రీనివాస్‌లు గురువారం మల్లారి అనిల్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ సమస్య తీర్చేవారెవరు?

సికింద్రాబాద్ గణేష్ టెంపుల్‌కు పార్కింగ్ సమస్య

రెజిమెంటల్‌బజార్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మానసిక ప్రశాంతత కోసం దేవుడిని దర్శించుకుందామనే భక్తులకు వాహనాల పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న గణేష్ టెంపుల్‌కు ఏళ్లుగా పార్కింగ్ సమస్య ఉంది. ఆలయానికి రోజు సుమారు రెండువేల మంది, పండుగ రోజుల్లో పదివేల మంది వరకు భక్తులు దర్శనం కోసం వస్తుంటారు. కేవలం 20 ద్విచక్ర వాహనాలకు మాత్రమే పార్కింగ్ స్థలం ఉంది. ఆలయ ఉద్యోగులు పార్కింగ్ చేస్తే అది కూడా ఉండదు. ఆలయంలో కాళ్లు కడుక్కునే స్థలం వద్ద ఆలయ సిబ్బంది టూ వీలర్స్ పార్కింగ్ చేస్తుండటంతో భక్తులకు ఇబ్బందిగా మారింది. ఎక్కువగా దూర ప్రాంతాల వారు, టెంపుల్ ముందు నుంచి ఉద్యోగం, వ్యాపార పనులపై వెళ్లేవారు గణపతి దర్శనానికి వస్తుంటారు. కనీసం వాహనం నిలిపే అవకాశం లేక పోవడంతో సమస్యగా మారింది. ఏళ్లుగా పార్కింగ్ సమస్యకు పరిష్కారం లభించడం లేదు.

రైల్వేను కోరినా స్పందన లేదు

ఆలయం పక్కనే ఉన్న రైల్వేస్టేషన్ స్థలంలో ఉన్న కొంత స్థలాన్ని ఆలయ పార్కింగ్‌కు కేటాయించాలని ఆలయం వారు కోరుతున్న రైల్వేశాఖ స్పందించడం లేదు. 1990 నుంచి పలుమార్లు రైల్వే శాఖకు ఆలయ అధికారులు, పాలకమండలి వినతిపత్రం ఇచ్చినా స్పందన లేదు. గతంలో రైల్వేస్టేషన్ సందర్శనకు వచ్చిన కేంద్ర రైల్వేమంత్రికి కూడా వినతి పత్రం ఇచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



పార్కింగ్‌కు కోసం అడుగుతున్న రైల్వే స్థలం

ఫుట్‌పాత్‌పైనే పార్కింగ్

ఆలయానికి ఉన్న కాస్త పార్కింగ్‌లో చెప్పుల స్టాండ్, రెండు రథాలు ఉండటంతో ఉన్న స్థలం ఇరుకుగా మారింది. అతి కష్టం మీద పెడితే ఇరవై ద్విచక్ర వాహనాలకు మాత్రమే స్థలం ఉంది. దీంతో భక్తులు ఫుట్‌పాత్‌పై ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ఆలయానికి వచ్చే భక్తులతో పాటు రాకపోకలు సాగించే వారికి అటంకంగా మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.



ఆలయం ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై పార్కింగ్



ఆలయం వద్ద ఫుట్‌పాత్‌పై వాహనాల పార్కింగ్

రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్తా...



ఆలయానికి ప్రధాన అడ్డంకిగా ఉన్న పార్కింగ్ సమస్య తీర్చడానికి ప్రయత్నం చేస్తున్నాం. ఇప్పటికే ఎమ్మెల్యే శ్రీగణేష్ దృష్టికి తీసుకెళ్లి ఆయన సహకారంతో రైల్వే జీఎంను కలిసి పార్కింగ్ సమస్యపై మాట్లాడతాం. పార్కింగ్ స్థలం కోసం నా వంతు కృషి చేస్తాను.

- ప్రభాకర్ యాదవ్, ఆలయ చైర్మన్

పాదచారులకు ఇబ్బంది



భక్తులు ఫుట్‌పాత్, రోడ్డుపై వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుంది. రేతిఫైల్ బస్‌స్టేషన్ నుంచి రైల్వేస్టేషన్ వైపు వెళ్లేవారు ఫుట్‌పాత్‌పై నుంచి నడిచే దారి లేక రోడ్డు మీద వెళ్లాల్సి వస్తోంది. ఈ సమస్య తీరితే సౌకర్యంగా ఉంటుంది.

- సతీష్, ట్రాఫిక్ ఎస్సై